సాక్షి
జనగామ
శనివారం ¦ 28 ¦ అక్టోబర్ ¦ 2023



భర్తకు పదేళ్ల జైలు

అదనపు కట్నం వేధింపుల కారణంగా వివాహిత ఆత్మహత్య చేసుకోగా భర్తకు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. - 10లో▸



పలు రైళ్ల రద్దు పొడిగింపు

సిగ్నల్ వ్యవస్థ అభివృద్ధి, మూడో రైల్వే లైన్ పనుల నేపథ్యంలో పలు రూట్లలో ప్యాసింజర్ రైళ్ల రద్దును పొడిగించారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /22^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వెంకన్న సన్నిధిలో డీసీపీ దంపతుల పూజలు



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామిని శుక్రవారం డీసీపీ సీతారాం దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారికి అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఆశీర్వచనాలతో పాటు స్వామివారి వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఎస్సై వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు జనగామలో 'సమురాయ్' శిక్షణ

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డు బైపాస్ ఏరియా నందన గార్డెన్‌లో ఈనెల 29న జపాన్ దేశానికి చెందిన సంప్రదాయ యుద్ధకళ సమురాయ్(కత్తిసాము) జాతీయ స్థాయి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సమురాయ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ శిక్షణకు తెలంగాణలోని కుంగ్‌ఫూ, కరాటే, బాక్సింగ్ నిపుణులు, పాఠశాల విద్యార్థులు, అలాగే మహారాష్ట్ర, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా సమురాయ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమా ఉదయ్ పాల్గొంటారని వివరించారు.

గిరిజన సంక్షేమాధికారిని సస్పెండ్ చేయాలి



జనగామ రూరల్: ఎన్నికల నియమ నిబంధనలు పాటించకుండా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ పోస్టులు భర్తీ చేసిన గిరిజన సంక్షేమాధికారి ప్రేమ కళారెడ్డిని సస్పెండ్ చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు సురేష్ మాట్లాడుతూ.. 2018లో 23 మంది సీఆర్టీలను నియమించగా విద్యార్థుల సంఖ్య మేరకు మరో ఆరు పోస్టులు భర్తీ చేయడానికి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. అయితే నోటిఫికేషన్ లేకుండా పోస్టులు భర్తీ చేసి స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా హెచ్‌ఎం సారయ్య చొరవతో ముగ్గురిని నియమించారని ఆరోపించారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థి జి.చరణ్(బైపీసీ ఫస్టియర్) ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.కాళహస్తి, పీడీ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు చరణ్‌ను శుక్రవారం పాఠశాలలో వారు అభినందించి మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఈనెల 3 నుంచి జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థి చరణ్ ఫుట్‌బాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో ఈనెల 31 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చరణ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమ్మయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ జయంధర్, పీఈటీ రాణాప్రతాప్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల అధికార ప్రతినిధిగా 'రావెల'



జనగామ: జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్‌ఎస్ ఎన్నికల పర్యవేక్షణ అధికార ప్రతినిధిగా రావెల రవి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగంతో కలిసి అసెంబ్లీ, రానున్న పార్లమెంటు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల సమయంలో రవి పార్టీ తరఫున అధికార ప్రతినిధిగా పని చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించిన ఈవీఎం, బీయూ, సీయూ, వీవీ ప్యాట్‌లకు సంబంధించి పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు.

అభివృద్ధి పరిస్తూ.. ప్రజలతో చెప్పిస్తూ..

ప్రతిపక్షాల తీరును ఎండగడుతూ సాగిన కేసీఆర్ ప్రసంగం

- రైతుబంధు, కరెంటుపై నేరుగా సభికులను ప్రశ్నిస్తూ.. సమాధానాలు రాబట్టిన సీఎం
- ఎవరు ప్రజలకు సేవచేశారు.. ఏ పార్టీ మంచిదో ఆలోచించాలని సూచన
- తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిపై సుదీర్ఘ వివరణ
- జనాల ఉత్సాహం చూస్తుంటే అభ్యర్థులు గెలిచినట్లేనని ధీమా
- మానుకోట, వర్ధన్నపేట ప్రజా ఆశీర్వాద సభల సక్సెస్‌తో శ్రేణుల్లో ఉత్సాహం







మానుకోట, వర్ధన్నపేట సభల్లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు బానోతు శంకర్‌నాయక్, అరూరి రమేశ్, భట్టుపల్లిలో కళాకారుల ప్రదర్శన..

సాక్షి, మహబూబాబాద్/కాజీపేట అర్బన్: ఒక వైపు తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూనే.. మరోవైపు ప్రతిపక్షాలపై ఘాటు విమర్శలు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రసంగం సాగింది. మధ్య మధ్యలో పలు అంశాలపై సభకు హాజరైన వారిని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో, వరంగల్ నగర పరిధి భట్టుపల్లిలో జరిగిన మానుకోట, వర్ధన్నపేట నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలకు కేసీఆర్ హాజరయ్యారు. మానుకోట, భట్టుపల్లి సభా ప్రాంతాలు గులాబీమయమయ్యాయి. రెండు చోట్లా భారీగా తరలివచ్చిన జనాన్ని చూసిన సీఎం.. తమ పార్టీ అభ్యర్థుల విజయం ఖాయమైనట్లేనని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలను అడుగుతూ..

సభల్లో సీఎం ప్రసంగిస్తూ పలు పథకాలపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వాటికి ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధుపై చేసిన వ్యాఖ్యలు చెబుతూ 'రైతు బంధు ఉంచాలా.. వద్దా.. ఉంచాలనే వారు చేతులు ఎత్తండి' అనగానే సభకు వచ్చిన వారు చేతులెత్తారు. ఎత్తిన చేతులు చూసి.. ఇవే చేతులు పోలింగ్ బూత్ వద్ద ఎత్తాలి' అని పిలుపునిచ్చారు. ఉచిత కరెంట్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ధరణిపై రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క చెప్పిన మాటలను చెబుతూ.. ధరణిని కాదు.. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో వేయాలి.. అని అందు కోసం బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి' అని అనగానే వేస్తాం అని వారితో చెప్పించారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, పింఛన్ పెంపు, 24 గంటల కరెంటు, మొదలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇన్ని పనులు చేసిన బీఆర్‌ఎస్ మంచిదా..? మోసం చేసే కాంగ్రెస్ మంచిదా.. ? అని ప్రజలను ప్రశ్నించి బీఆర్‌ఎస్ మంచిది అనే సమాధానం రాబట్టారు. ఇప్పుడు అన్ని పథకాలు ప్రజల వద్దకే వస్తున్నాయని, ఏక్ అణా కూడా లంచం ఇవ్వకుండా పాలన సాగుతుందని చెప్పుకొచ్చారు.

మానుకోటలో గిరిజన భాషలో ప్రసంగం ప్రారంభం

మానుకోట సభలో సీఎం కేసీఆర్ 'గోర్‌మాటీ యాడియోం.. బాయోం.. రాం.. రాం.. (లంబాడీ అమ్మలారా, అన్నలారా నమస్కారాలు) అంటూ గిరిజన భాషలో ప్రసంగం ప్రారంభించి సభికులను ఉత్తేజ పరిచారు. తెలంగాణ ఉద్యమంలో మానుకోట పాత్రను వివరించారు. అప్పుడు ఈ ప్రాంతం ఎలా ఉండేదో చెప్పారు. ఇప్పుడు మారిన మానుకోటను వివరించారు. మహబూబాబాద్ జిల్లా ఏర్పాటుకోసం తానే పట్టుబట్టానని చెప్పారు. జిల్లాలోని ఆకేరు, మున్నేరు వాగుల్లో గోదావరి జలాలు నిండడం చూసి కడుపు నిండినట్లు అయ్యిందని అన్నారు. తండాల్లో మారిన పరిస్థితి చెబుతూ.. మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ జిల్లాను అభివృద్ధి చేయడంలో నిధుల సేకరణ చెబుతుండగా.. ప్రజలు ఉత్తేజంగా ఈలలు వేశారు. మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసింది బీఆర్‌ఎస్ కాదా..అని అడుగుతూ ప్రజలతో అవును అనే సమాధానం చెప్పించారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మంచివాడని, పట్టణ అభివృద్ధికి నిధులు అడగగానే రూ. 50కోట్లు మంజూరు చేశానని చెప్పి సభపైన ఉన్నవారిని కూడా ఉత్తేజ పరిచారు.

అభివృద్ధిలో వర్ధన్నపేట ముందుంది..

వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అరూరి రమేశ్ రూ.160 కోట్ల నిధులతో వర్ధన్నపేటను మున్సిపాలిటీగా అభివృద్ధి చేశారని సీఎం కేసీఆర్ అన్నారు. 40 విలీన గ్రామాలతో అభివృద్ధిలో ముందుందని, పట్టణీకరణతో వరంగల్‌లో కలిసిపోయిందని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారం రింగ్‌రోడ్డు ద్వారా ల్యాండ్ పూలింగ్ జరిగి భూమిని కోల్పోతారని, అది అవాస్తవమని, తాను హామీ ఇస్తున్నా అని ఎవరి భూమిని కోల్పోరని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో అరూరి రమేశ్ కోరిన విధంగా ఎన్నికల తర్వాత సాదాబైనామాకు అవకాశం కల్పిస్తానని తెలిపారు.

శంకర్‌నాయక్, రమేశ్‌ను మూడోసారి గెలిపించండి

మహబూబాబాద్, వర్ధన్నపేట బీఆర్‌ఎస్ అభ్యర్థులు శంకర్‌నాయక్, అరూరి రమేశ్‌ను మూడోసారి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ గెలిచింది కాబట్టే జిల్లాకు మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల వచ్చిందని చెప్పారు. గిరిజన బిడ్డలకోసం పాఠశాలలు, పోడు రైతులకు పట్టాలు, రైతు బంధు, బీమా అందజేస్తున్నామని, కేసులు లేకుండా అడవి బిడ్డలు ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. ఓటేసి గెలిపించిన శంకర్‌నాయక్ ఇప్పుడు జిల్లాకు పరిశ్రమ కావాలని పట్టుపడుతున్నారని అన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే ముందుకు సాగాలంటే మూడోసారి శంకర్‌నాయక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 'మీ మధ్యలో ఉండే సింపుల్ మనిషి అరూరి రమేశ్‌కు గతంలో 80, 90 వేల మెజార్టీతో విజయం అందించారు. రాబోయే ఎన్నికల్లో లక్ష మెజార్టీ దాటే విధంగా ఆశీర్వదించాలి' అని పిలుపునిచ్చారు. మహబూబాబాద్, వర్ధన్నపేట అభ్యర్థులే బానోతు శంకర్‌నాయక్, అరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన సభల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నరేందర్, రెడ్యానాయక్, మేయర్ సుధారాణి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు పాలేరుగా పనిచేస్తా : శంకర్‌నాయక్



తనను మూడోసారి గెలిపిస్తే పాలేరుగా పనిచేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే, అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ అన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని, అందులో భాగంగానే ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపడానికి తండాలను గ్రామపంచాయతీలుగా చేశారని, ఆరు శాతం రిజర్వేషన్‌ను పది శాతం చేశారన్నారు. మానుకోట జిల్లాను వైద్య, విద్యపరంగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

మీ ఆశీర్వాదం.. కేసీఆర్ ధైర్యంతోనే : రమేశ్



వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, సీఎం కేసీఆర్ ధైర్యంతోనే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, మూడోసారి మీ ఆశీర్వాదం కోసం ముందుకు వస్తున్నానని ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలను గడపగడపకు అందించానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి కల్పిస్తున్నామన్నారు.

ప్రజా ఆశీర్వాద సభలు సాగాయి ఇలా..

- సాయంత్రం 4.08 గంటలకు మానుకోటకు చేరుకున్న సీఎం కేసీఆర్ హెలికాప్టర్
- 4.15 గంటలకు: బస్సు ద్వారా సభా ప్రాంగణానికి కేసీఆర్
- 4.20–4.30 వరకు : సభలో ప్రసంగం
- 4.44 నిమిషాలకు తిరిగి హెలిపాడ్ వద్దకు
- 4.50 గంటలకు: హెలికాప్టర్‌లో వరంగల్‌కు ప్రయాణం
- 5.08గంటలకు: భట్టుపల్లిలో హెలికాప్టర్ ల్యాండింగ్
- 5.12గంటలకు: బస్సులో సభా ప్రాంగణానికి
- 5.17 గంటలకు వేదికపైకి కేసీఆర్
- 5.20–5.30 వరకు: వేదికపై కేసీఆర్ ప్రసంగం
- 5.37గంటలకు: బస్సులో హెలిపాడ్ వద్దకు..
- 5.44 గంటలకు : హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



భట్టుపల్లిలో జరిగిన వర్ధన్నపేట ఆశీర్వాద సభకు హాజరైన జనం



మహబూబాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

ఎన్నికలకు వసతులు కల్పించాలి

- కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి శుక్రవారం నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, రిస్క్ మేనేజ్‌మెంట్ టీం సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పోలింగ్‌కు ఒక రోజు ముందే సామగ్రి సిద్ధంగా ఉంచుకుని సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. పోలింగ్ బూత్‌లలో ముందుగా సైన్ బోర్డులు ఏర్పాటు చేసి, సిబ్బందిని బస్సుల్లో తరలించడానికి రూట్ల వారీగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు ఎపిక్ కార్డుతో పాటు 12 రకాల గుర్తింపు పొందిన కార్డుల గురించి ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. దృష్టిలోపం కలిగిన, వయసు 80 ఏళ్లు నిండిన, పోస్టల్ బ్యాలెట్ వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సమయానికి 19 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని, ఎన్నికల రోజు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి సుహాసిని, రిటర్నింగ్ అధికారులు మురళీకృష్ణ, రామ్మూర్తి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చెక్‌పోస్టుల నిర్వహణ పక్కాగా ఉండాలి

కొడకండ్ల : ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల నిర్వహణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్, ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య అన్నారు. శుక్రవారం గిర్నితండా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుతో పాటు మొండ్రాయి, రామవరం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రోహిత్‌సింగ్, తహసీల్దార్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

జనగామ రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. శామీర్‌పేటలో ఐకేపీ, చీటకోడూర్ రోడ్డులో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సెంటర్‌లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగిలప్ప, డీపీఎం రాజేంద్రప్రసాద్, డీసీఓ రాజేందర్‌రెడ్డి, డీఎం ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్‌నాయక్, సీఈఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కంచుకోట వరంగల్

- ఇక్కడి ఉంచి ఎనిమిదిసార్లు విజయం
- స్వతంత్రులకు సైతం అవకాశం కల్పించిన ఓటర్లు

నడిచి ప్రచారం చేశా..

- ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేశారు
- పరకాల మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య - 10లో▸

జంగ్ తెలంగాణ

మరో ఏడుగురు ఖరారు

- కాంగ్రెస్ రెండో జాబితాలో ఉమ్మడి వరంగల్‌లో ఏడు స్థానాలకు అభ్యర్థులు
- మొదటి జాబితాలో నలుగురి పేర్లు విడుదల..
- మొత్తంగా 11 నియోజకవర్గాలకు ఖరారు.. డోర్నకల్ సస్పెన్స్
- పాలకుర్తిలో ఝాన్సీరెడ్డి కోడలికి అవకాశం



సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎట్టకేలకు శుక్రవారం రాత్రి అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసింది. ఉమ్మడి వరంగల్‌లోని ఏడు నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ నెల 15న తొలి జాబితాలో నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, ములుగు, భూపాలపల్లి అభ్యర్థులను ప్రకటించిన టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీ.. రెండో జాబితాలో మరో ఏడు స్థానాలకు ఖరారు చేసింది. ఇదిలా ఉండగా డోర్నకల్ స్థానానికి ఎవరి పేరునూ ప్రకటించలేదు.

12 రోజుల తర్వాత..

అభ్యర్థుల తొలి జాబితాను ఈనెల 15న ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం.. 12 రోజుల తర్వాత రెండో జాబితాను వెల్లడించింది. తొలి జాబితాలో దొంతి మాధవరెడ్డి (నర్సంపేట), ధనసరి సీతక్క (ములుగు), గండ్ర సత్యనారాయణరావు (భూపాలపల్లి), సింగపురం ఇందిర (స్టేషన్‌ఘన్‌పూర్) పేర్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో జాబితాలో ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత రేవూరి ప్రకాష్‌రెడ్డికి పరకాల నుంచి టికెట్ లభించింది. ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కొండా మురళీధర్ రావుకు సర్దిచెప్పినట్లు పార్టీవర్గాల సమాచారం. కాగా వరంగల్ తూర్పు నుంచి మాజీ మంత్రి కొండా సురేఖకు అవకాశం దక్కింది.


వరంగల్ పశ్చిమ నుంచి డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పోటీ చేయనున్నారు. పాలకుర్తి నుంచి ప్రయత్నించిన ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పౌరసత్వ సమస్యతో తప్పుకుని ఆమె కోడలు యశస్వినిరెడ్డికి టికెట్ ఇప్పించుకోగా.. జనగామ నుంచి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పార్టీ అవకాశం కల్పించింది. మహబూబాబాద్ (ఎస్టీ)నుంచి మురళీనాయక్, వర్ధన్నపేట (ఎస్సీ)నుంచి మాజీ పోలీసు అధికారి, ఎన్నికల నేపథ్యంలోనే పార్టీలో చేరిన కేఆర్ నాగరాజు పేర్లు ఖరారయ్యాయి.

డోర్నకల్‌పై సస్పెన్స్.. సీనియర్లకు ఆశాభంగం

ఉమ్మడి జిల్లాలోని 11నియోజకవర్గాలకు మొదటి, రెండు జాబితాల్లో అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం.. డోర్నకల్‌ను మాత్రం సస్పెన్స్‌లో పెట్టింది. ఇక్కడి నుంచి ఎనిమిది మంది వరకు దరఖాస్తు చేసుకున్నా.. ప్రధానంగా రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, భూపాల్‌నాయక్ పోటీ పడుతుండడంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠకు మాత్రం తెరపడలేదు. ఇదిలా ఉండగా పలు స్థానాల నుంచి టికెట్ కోసం పోటీపడ్డ కొందరు సీనియర్లకు ఆశాభంగం కలిగింది. మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, వర్ధన్నపేట నుంచి నమిండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య టికెట్ ఆశించినా భంగపాటు తప్పలేదు. వరంగల్ పశ్చిమ నుంచి దరఖాస్తు చేసుకున్న జనగామ డీసీసీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, వరంగల్ తూర్పు నుంచి ప్రయత్నం చేసిన ఎర్రబెల్లి స్వర్ణ, పరకాలను ఆశించిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కొండా మురళీధర్‌రావుకు కూడా టికెట్ దక్కలేదు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అభ్యర్థిత్వంపై ముందే లీక్ కావడంతో అక్కడ ఆశించిన మాజీ మంత్రి, సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్‌ను వీడి ఈ నెల 16న జనగామలో కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

అభ్యర్థుల బయోడేటా

- వివరాలు 10లో▸



అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు
ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు
ఇప్పటి దాకా ఏం చేశాడో చూడు
పెట్టుకునే టోపీకాదు..
పెట్టిన టోపీ చూడు
- కాళోజీ నారాయణరావు

ఈ ముచ్చటెరికేనా ?

మీడియా తస్మాత్ జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరంగల్: ఎన్నికల సంఘం నియమావళిని మీడియా పాటించాలని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నోడల్ అధికారి, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య ఆదేశాల మేరకు శుక్రవారం డీఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఎన్నికల సంఘం నియమావళికి లోబడి ఎంపీసీ, ఎంసీఎంసీ సోషల్ మీడియా తదితర అంశాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి, కె.శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

మంత్రిని ఆపిన పోలీసులు



మంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

నెల్లికుదురు: రయ్.. రయ్ మంటూ ఎర్రబుగ్గేసుకుని పరుగులు పెట్టే మంత్రి వాహనాన్ని పోలీసులు ఆపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు.

కాంగ్రెస్ కంచుకోట వరంగల్

ఇక్కడి నుంచి ఎనిమిది సార్లు విజయం

● స్వతంత్రులకు సైతం అవకాశం కల్పించిన ఓటర్లు



దోనెపూడి రమేశ్‌బాబు



అరెల్లి బుచ్చయ్య



నన్నపునేని నరేందర్




కొండా సురేఖ



టి.పురుషోత్తం రావు



బస్వరాజు సారయ్య



రెండుసార్లు మంత్రి పదవులు

- 1989లో వరంగల్ నుంచి గెలిచిన తక్కళ్లపల్లి పురుషోత్తమరావు సీఎం చెన్నారెడ్డి మంత్రి మండలిలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- 2009లో వరంగల్ నుంచి గెలుపొందిన బస్వరాజు సారయ్య సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి మండలిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
2018	నన్నపునేని నరేందర్	టీఆర్ఎస్	వద్దిరాజు రవిచంద్ర	కాంగ్రెస్	28,782
2014	కొండా సురేఖ	టీఆర్ఎస్	బస్వరాజు సారయ్య	కాంగ్రెస్	55,085
2009	బస్వరాజు సారయ్య	కాంగ్రెస్	ఇ.ప్రదీప్‌కుమార్	పీఆర్పీ	7,255
2004	బస్వరాజు సారయ్య	కాంగ్రెస్	గుండు సుధారాణి	టీడీపీ	41,167
1999	బస్వరాజు సారయ్య	కాంగ్రెస్	దోనెపూడి రమేశ్‌బాబు	టీడీపీ	9,251
1994	దోనెపూడి రమేశ్‌బాబు	టీడీపీ	టి.పురుషోత్తంరావు	కాంగ్రెస్	16,439
1989	టి.పురుషోత్తంరావు	కాంగ్రెస్	బస్వరాజు సారయ్య	స్వతంత్ర	8,379
1985	బండారు నాగభూషణరావు	టీడీపీ	అబ్దుల్ ఖాదర్ అహ్మద్	కాంగ్రెస్	7,888
1983	బండారు నాగభూషణరావు	టీడీపీ	భూపతి కృష్ణమూర్తి	బీజేపీ	8,836
1978	ఆరెల్లి బుచ్చయ్య	కాంగ్రెస్	భూపతి కృష్ణమూర్తి	జనతా	13,271
1972	పి.ఉమారెడ్డి	కాంగ్రెస్	భూపతి కృష్ణమూర్తి	ఎస్‌టీపీఎస్	1,961
1967	టీఎస్ మూర్తి	స్వతంత్ర	బి.నాగభూషణరావు	కాంగ్రెస్	15,846
1962	బి.నాగభూషణరావు	స్వతంత్ర	మీర్జా షుకుర్ బేగ్	కాంగ్రెస్	1,718
1957	మీర్జా షుకుర్ బేగ్	కాంగ్రెస్	ఎ.సత్యనారాయణ	పీఎస్‌పీ	3,006
1952	ఎం.ఎస్.రాజలింగం	కాంగ్రెస్	ఎ.సత్యనారాయణ	స్వతంత్ర	7,326

వరంగల్: వరంగల్ నియోజకవర్గం ప్రస్తుతం వరంగల్ తూర్పుగా రూపాంతరం చెందింది. 1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఎనిమిది సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, మూడుసార్లు స్వతంత్రులు, రెండు సార్లు టీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. 1952లో మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.ఎస్.రాజలింగం విజయం సాధించారు. 1962, 1967 సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీ చేసిన బండారు నాగభూషణరావు, టీఎస్.మూర్తి విజయం సాధించారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనతో వరంగల్ తూర్పు నియోజకవర్గంగా రూపాంతరం చెందింది.

వ్యాపార కేంద్రంగా గుర్తింపు..

వరంగల్ తూర్పులో వ్యాపార, వాణిజ్య వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్, లక్ష్మీపురం కూరగాయ మార్కెట్, బట్టల బజార్, బంగారు ఇతర వ్యాపార సంస్థలు, గతంలో బీడీ పరిశ్రమల వల్ల ఈప్రాంతంలో కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఆజంజాహి మిల్లు ఉన్న సమయంలో అనేక మంది కార్మికులు ఉపాధి పొందేవారు. అయితే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,46,282 ఉండగా.. అందులో పురుషులు 1,20,323, మహిళలు 1,25,621, థర్డ్‌జెండర్స్ 338 ఉన్నారు.


తెలంగాణ వాదంతో..

ప్రత్యేక తెలంగాణ నినాదంతో నగరానికి చెందిన వ్యాపార, సామాజిక వేత్త భూపతి కృష్ణమూర్తి 1972లో సంపూర్ణ తెలంగాణ ప్రజా సమితి నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతిలో స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. అనంతరం 1978లో జనతా పార్టీ నుంచి పోటీ చేసి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో మళ్లీ ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికల సందర్భంగా వరంగల్ నుంచి పోటీ చేయాలని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అవకాశం కల్పించినా.. బీజేపీ నుంచి పోటీ చేసి మళ్లీ ఓడిపోయారు.

జంగ్ తెలంగాణ

నడిచి ప్రచారం చేశా

● ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటేశారు
● కష్టపడిన కార్యకర్తను గుర్తించేవారు
● ఆనాడు పార్టీ ఫిరాయింపుల్లేవు
● ఆరోజుల్లో ఎన్నికల ఖర్చు రూ.1.42 లక్షలు
● పరకాల మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య
● 'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ



హసన్‌పర్తి: 'ఆ రోజుల్లో ఎన్నికల ప్రచారం కోసం బస్సుల్లో వెళ్లి.. గ్రామాల్లో కాలినడకన తిరిగి ప్రచారం చేశా. ప్రచారానికి ఒక పాత కారు ఉండేది. పది బైక్‌లు ఉండేవి. ఎన్నికల ప్రచారానికి కరపత్రాలు, వాహనాల్లో పెట్రోల్, భోజనాలకు అన్నీ కలిపి రూ.1.42 లక్షలు మాత్రమే ఖర్చు చేశా' అని పరకాల మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య అన్నారు. గత పరిస్థితులు, వర్తమాన రాజకీయాలపై ఆయన 'సాక్షి'తో ముచ్చటించారు. సారయ్య ఎదుర్కొన్న అనుభవాలు ఆయన మాటల్లోనే..

1994లో ఎమ్మెల్యేగా..

మాది హసన్‌పర్తి మండలం ఎల్లాపురం. సీపీఐ పార్టీకి ఫుల్‌టైం కార్యకర్తను. ప్రస్తుతం పలివేల్పులలో ఉంటున్నా. 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లో భాగంగా పరకాల స్థానాన్ని పొత్తుల్లో భాగంగా సీపీఐకి కేటాయించారు. టీడీపీ మిత్రపక్ష అభ్యర్థిగా అధిష్టానం నన్ను ఎంపిక చేసింది. మాజీ మంత్రి బి.సమ్మయ్యపై 4,500 మెజార్టీతో గెలిచా. 1994-1999 వరకు ఎమ్మెల్యేగా పని చేశా.

ప్రజలు స్వచ్ఛందంగా ఓటేసేవారు..

ఆ కాలంలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేసేవారు. సేవ చేస్తాడని భావించి నిబద్ధత కలిగిన వారికి ఓటేసేవారు. కులం, మతం అనేది చూసేవారు కాదు. ప్రస్తుతం రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయి. సేవా భావం, నిబద్ధతను పక్కన పెట్టి దోపిడీదారులను, రాజకీయాలు చేసే వారిని అందలమెక్కిస్తున్నారు. పార్టీలో పని చేయని బడా వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లతో పాటు క్రిమినల్స్ సొంత లాభం కోసం ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా పార్టీల అధినాయకత్వం కూడా వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవడం దురదృష్టకరం.

కష్టపడిన కార్యకర్తకే గుర్తింపు..

ఆరోజుల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు ఇచ్చేవారు. ప్రస్తుతం కష్టపడిన కార్యకర్తను గుర్తించడం లేదు. ఆర్థికంగా, అంగ, కుల బలాన్ని ప్రమాణికంగా తీసుకుంటున్నారు. సేవా భావం, నిబద్ధతలను పరిగణనలోకి తీసుకోవట్లేదు. దీంతో కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు లేకుండా పోతోంది. గత ఎన్నికల కమిషన్‌కు ప్రస్తుత ఎన్నికల కమిషన్‌కు చాలా తేడా ఉంది. గతంలో నియోజకవర్గంలో అభ్యర్థిపై ఫిర్యాదు అందితే తక్షణమే స్పందించి చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ సభ్యుల సంఖ్య ఒకటి నుంచి ముగ్గురికి చేరడం వల్ల ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు తీసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పని చేస్తోంది. ఎన్నికల కమిషన్‌ను పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్పుడు పార్టీ ఫిరాయింపుల్లేవు

అప్పట్లో ఏ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థి.. అదే పార్టీలో కొనసాగేవాడు. ఫిరాయింపులు ఉండేవి కావు. ప్రస్తుతం ఫిరాయింపులు ఎక్కువయ్యాయి. అభ్యర్థుల్లో సేవాభావం, నిబద్ధత కరువయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వ అధికారులు అధికార పార్టీకి బానిసలుగా పనిచేస్తున్నారు.

ప్రస్తుతం పనికో రేటు!

కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పనికి ఓ రేటును ఫిక్స్ చేశారు. అధికారుల బదిలీలు.. ఇతర ఏ పనులకైనా డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో ప్రజలకు ఏమైనా సమస్యలుంటే అసెంబ్లీలో చర్చించేవారు. పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినట్లు తెలిస్తే అర్ధరాత్రి కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో మాట్లాడేవారు.

నాకు గన్‌మెన్ కూడా లేకుండే..

ప్రస్తుతం ఎమ్మెల్యేలకు 2+2 సెక్యూరిటీ ఉంది. నేను ఐదేళ్ల పాటు గన్‌మెన్ లేకుండా నియోజకవర్గంలో తిరిగా. ప్రజల్లో ఒకడిగా వారి బాధలను తెలుసుకుని పరిష్కారం చూపా.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో పలు సెక్షన్లలో సిగ్నల్ వ్యవస్థ పునరాభివృద్ధి, మూడో రైల్వే లైన్ పనుల నేపథ్యంలో.. దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రూట్లలో ప్రయాణించే ఆరు ప్యాసింజర్ రైళ్ల సర్వీస్‌ల రద్దును పొడిగించినట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే అభివృద్ధి కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్యాసింజర్ రైళ్లను ఈనెల 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, భద్రాచలం రోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్, సికింద్రాబాద్-వరంగల్ (07462) పుష్పుల్, వరంగల్-హైదరాబాద్ (07463) పుష్పుల్ రైళ్లను ఈనెల 30వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభలో..





వర్ధన్నపేట నియోజకవర్గ సభకు తరలివస్తున్న గిరిజనులు, మానుకోట సభలో ఒంటిపై కేసీఆర్ బొమ్మతో అభిమాని



మానుకోట సభలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు

కట్న వేధింపుల కేసులో పదేళ్ల జైలు

● రూ. 35 వేల జరిమానా
● తీర్పు ఇచ్చిన మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: అదనపు కట్న వేధింపుల కారణంగా వివాహిత ఆత్మహత్య చేసుకోవడంతో అందుకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష, రూ.35 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన నాగబోయిన వెంకన్న కుమార్తె ఉమకు మహబూబాబాద్ మండలం వేంనూర్ గ్రామానికి చెందిన గుండ్ల మధుతో 2009లో వివాహమైంది. అనంతరం మధు తన భార్య ఉమను అదనపు కట్నం కోసం వేధించడంతో ఆమె 2012 ఆగస్టు 25న మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. అప్పుడు ఆమెకు రెండు నెలల కుమారుడు ఉన్నాడు. అదే రోజున జీఆర్పీ డోర్నకల్ హెడ్‌కానిస్టేబుల్ యాకుబ్ ఆమె మృతిపై తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఉమ ఆత్మహత్యపై అనుమానంతో జీఆర్పీ పోలీసులు ఆ కేసును అదే ఏడాది అక్టోబర్ 6న మహబూబాబాద్ రూరల్ పోలీసులకు బదిలీ చేసి సమాచారం ఇచ్చారు. అప్పటి ఎస్సై రవిరాజు కేసు నమోదు చేయగా.. అప్పటి డీఎస్పీ (ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏసీబీ జాయింట్ డైరెక్టర్) రమాదేవి విచారణ ప్రారంభించారు. కేసు దర్యాప్తు ద్వారా కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 24 మంది సాక్ష్యులకుగాను ప్రస్తుత రూరల్ సీఐ రమేశ్, ఎస్సై రాంచరణ్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి హెడ్‌కానిస్టేబుల్ దేవా 14 మందిని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ నేరం నిరూపణ కావడంతో గుండ్ల మధుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.35 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈకేసులో నేరస్తుడికి శిక్షపడేలా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ అభినందించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల బయోడేటా

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రెండో అభ్యర్థుల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ములుగు, భూపాలపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట నియోజకవర్గాలకు మొదటిలిస్టులో అభ్యర్థులను ప్రకటించగా.. రెండో విడతలో డోర్నకల్ మినహా మిగతా అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. వారి బయోడేటా 'సాక్షి' ప్రత్యేకం.

వర్ధన్నపేట

అభ్యర్థి పేరు: కర్నన్ నాగరాజు
భార్య: మల్లీశ్వరి
తల్లిదండ్రులు: మునుస్వామి, రాజేశ్వరి
పుట్టినతేదీ: 04-03-1963
జన్మస్థలం: లక్ష్మీపురం, 43వ డివిజన్, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లా
కులం: మాల(ఎస్సీ)
విద్యార్హత: గ్రాడ్యుయేట్
అదనపు అర్హత: జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు
సంతానం: దిలీప్, దీపిక, దివ్యరాజ్ (ఉన్నత చదవులు చదివి స్థిరపడ్డారు)

పోలీస్ అధికారిగా నాగరాజు వివిధ హోదాల్లో పని చేశారు. 1989 నుంచి 98 వరకు ఎస్సైగా, 1998 నుంచి 2009 వరకు సీఐగా, 2009 నుంచి 2011 వరకు డీఎస్పీగా, వరంగల్-ఖమ్మం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా, అడిషనల్ ఎస్పీగా, అడిషనల్ డీసీపీగా, ట్రాఫిక్ సౌత్, అడిషనల్ డీసీపీగా హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో విధులు నిర్వహించారు. నిజామాబాద్ ఐపీఎస్ అధికారిగా పోలీస్ కమిషనర్ హోదాలో పని చేస్తూ.. ఈ ఏడాది ఉద్యోగ విరమణ పొందారు.

సామాజిక నేపథ్యం..

కేఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి క్రీడాకారులకు హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, హాకీ, క్రికెట్ కిట్లను అందిస్తున్నారు. పేద క్రీడాకారులకు స్పాన్సర్‌షిప్ చేస్తున్నారు. ప్రతీ ఏడాది పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందిస్తున్నారు. పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు చెల్లించడం, నిరుద్యోగులు ఉపాధి కోసం వస్తే పరిచయం ఉన్న సంస్థల్లో ఉద్యోగాలకు రెఫర్ చేస్తూ.. తదితర సామాజిక సేవలందిస్తున్నారు.

పాలకుర్తి

పేరు: మామిడాల యశస్వినిరెడ్డి
భర్తపేరు: హనుమాండ్ల రాజారాంమోహన్‌రెడ్డి
జననం: 03-02-1997
పుట్టిన స్థలం: హైదరాబాద్
విద్యార్హతలు: బీటెక్ (ఈసీఈ-2018)
తల్లిదండ్రులు: మామిడాల మాధవి-తిరుపతిరెడ్డి
చిరునామా: గ్రామం దిండి చింతపల్లి, మండలం వంగూర్, నాగర్ కర్నూల్ జిల్లా
అత్తమామలు: హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీరెడ్డి, రాజేందర్‌రెడ్డి
చిరునామా: గ్రామం. చెర్లపాలెం, మండలం తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా
ప్రస్తుత వృత్తి: రాజ్ ప్రాపర్టీస్ మేనేజ్‌మెంట్ కంపెనీ కాలిఫోర్నియా అమెరికా (రియల్ ఎస్టేట్ బిజినెస్)
సేవా కార్యక్రమాలు: ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వెటా) ద్వారా
ప్రస్తుతం ఓటరు నమోదు: దిండిచింతపల్లి, అచ్చంపేట నియోజకవర్గం, నాగర్‌కర్నూల్

వరంగల్ పశ్చిమ

పేరు: నాయిని రాజేందర్‌రెడ్డి
తండ్రి: నరేందర్‌రెడ్డి
తల్లి: జయమాల
భార్య: నీలిమరెడ్డి
కూతురు: డాక్టర్ నాయిని శ్రీగోదా రెడ్డి (ఎంబీబీఎస్)
పుట్టిన తేదీ: 21-07-1969
విద్యార్హతలు: బీకాం
రాజకీయంగా: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

జనగామ

పేరు: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
చదువు: ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
సామాజికవర్గం: ఓసీ
జననం: 2 జనవరి 1958
ఊరు: నర్సాయపల్లి, మండలం, మద్దూరు, జనగామ నియోజకవర్గం, జిల్లా: సిద్దిపేట
సతీమణి: అరుణ
సంతానం: ఇద్దరు కుమారులు (ప్రశాంత్, రాకేశ్, ఒక కుమార్తె సాయి ప్రియాంక)
ప్రస్తుత నివాసం: హైదరాబాద్
వృత్తి: రాజకీయం, 2004 నుంచి 2008, 2009 ఉప ఎన్నికల్లో రెండుసార్లు చేర్యాల ఎమ్మెల్యేగా కొనసాగారు. అంతకుముందు నర్మెట జెడ్పీటీసీగా గెలిచారు.
రాజకీయ ప్రస్థానం: ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్‌తో కలిసి రాజకీయ అరంగ్రేటం చేశారు. 2018లో బీజేపీకి రాజీనామా చేసిన కొమ్మూరి, కాంగ్రెస్‌లో చేరారు. జూన్ 2019లో జరిగిన శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసి 244 ఓట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

మహబూబాబాద్

పేరు: భూక్యా మురళీనాయక్
తల్లిదండ్రులు: మంగ్యానాయక్, దస్మ
సంతానం: రితిక్ సిద్ధార్థ, భువన్ సిద్ధార్థ
పుట్టిన తేదీ: 03-05-1970
స్వస్థలం: సోమ్లాతండా గ్రామం, మహబూబాబాద్ మండలం
విద్యార్హత: ఎంబీబీఎస్(ఉస్మానియా), ఎంఎస్(జిప్మర్ పాండిచ్చేరి)
రాజకీయ అనుభవం: తండ్రి మంగ్యానాయక్ పర్వతగిరి సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబాబాద్ మండల జెడ్పీటీసీగా పని చేశారు. భార్య ఉమా మురళీనాయక్ మహబూబాబాద్ మున్సిపాలిటీ తొలి చైర్‌పర్సన్‌గా పని చేశారు. మురళీనాయక్ టీపీసీసీ సెక్రటరీగా పని చేస్తున్నారు.

పరకాల

పేరు: రేవూరి ప్రకాశ్‌రెడ్డి
తండ్రిపేరు: నారాయణరెడ్డి
పుట్టిన తేదీ: 01-09-1952
విద్యార్హతలు: డిగ్రీ
గతంలో వృత్తి: రైల్వే కాంట్రాక్టర్



నివాసం: భవానీనగర్, హనుమకొండ
రాజకీయ ప్రవేశం: 1989లో టీడీపీ
విజయాలు: 1994లో నర్సంపేట ఎమ్మెల్యేగా ఎంసీపీఐ నేత ఓంకార్‌పై పోటీ చేసి విజయం సాధించారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

టీడీపీలో...

చంద్రబాబు సారథ్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో మెంబర్‌గా, 2000 నుంచి 2004 వరకు టీడీపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా, 2005 నుంచి 2012 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, 2014 నుంచి 2017 వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా 2017 నుంచి సెప్టెంబర్ 2019 వరకు పొలిట్ బ్యూరో మెంబర్‌గా పని చేశారు.

బీజేపీలో..

సెప్టెంబర్ 4, 2019లో బీజేపీలో చేరారు. నేషనల్ కౌన్సిలర్ మెంబర్‌గా పని చేశారు.
అలాగే 610 జీఓ కమిటీ చైర్మన్‌గా 2002లో హైపవర్ కమిటీ చైర్మన్‌గా, 2016లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు.

వరంగల్ తూర్పు

పేరు: కొండా సురేఖ
తండ్రి పేరు: తుమ్మ చంద్రమౌళి
తల్లి పేరు: తుమ్మ పద్మ
పుట్టిన తేదీ: 19 ఆగస్టు 1965
విద్యార్హత: బీకామ్
వృత్తి: రాజకీయం
భర్త: కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ
కూతురు: కొండా సుస్మిత పటేల్
కులం: పద్మశాలి(బీసీ)
స్వస్థలం: హనుమకొండ, వరంగల్
నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
రాజకీయ అనుభవం: 1995లో గీసుకొండ మండల పరిషత్ అధ్యక్షురాలు, పీసీసీ మెంబర్-1996, శాయంపేట ఎమ్మెల్యే-1999, కాంగ్రెస్ లెజిస్లేటివ్ కొశాధికారిగా, ఏఐసీసీ మెంబర్-2000, శాయంపేట ఎమ్మెల్యే-2004, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి(ఆంధ్రప్రదేశ్)-2009, పరకాల ఎమ్మెల్యే-2009, టీఆర్ఎస్ నుంచి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే-2014, పరకాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఓటమి-2019

క్లుప్తంగా

వేలం ఆదాయం రూ.35.5 లక్షలు

- సోమేశ్వరాలయంలో కొబ్బరి, తలనీలాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న ఈఓ లక్ష్మీప్రసన్న

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో 2023–24 సంవత్సరం తలనీలాల పోగు, కొబ్బరి కాయలు, పూజాద్రవ్యాల విక్రయ హక్కు(అభిషేకం, వాహనపూజ సామగ్రి మినహా)కు శుక్రవారం వేలం నిర్వహించారు. హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో చేపట్టిన వేలంలో కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాల విక్రయ హక్కును మండల కేంద్రానికి చెందిన సింగ మహేందర్ రాజు రూ.25,05,000 పాడి దక్కించుకున్నారు. అలాగే తలనీలాలు పోగు హక్కును యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన బొజ్జ ఏడుకొండలు రూ.10,00,000లకు పొందారు. ఈ వేలం ద్వారా ఆలయానికి రూ.35.05 లక్షల ఆదాయం సమకూరిందని, గత ఏడాది కంటే రూ.3,37,000 పెరిగిందని ఆలయ ఈఓ బి.లక్ష్మీప్రసన్న తెలిపారు.

స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

- జిల్లాలో 3,6,9 తరగతుల విద్యార్థులకు..
- 345 పాఠశాలల్లో 13,345 మంది విద్యార్థులు
- నేడు మండల, జిల్లా స్థాయి కో–ఆర్డినేటర్లకు శిక్షణ

విద్యారణ్యపురి: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్) -2023ను ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నవంబర్ 3న నిర్వహించనున్నారు. ఈ మేరకు హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్‌స్కూల్స్, గురుకులాల్లో చదివే 3వ, 6 వ, 9వ తరగతి విద్యార్థులకు ఈ సర్వే ఉండనుంది. ఆయా విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, గణితంలో అందుకు ప్రాక్టీస్ చేయించాల్సింటుంది. ఇప్పటికే ఓసారి ప్రాక్టీస్ చేయించారు. 3, 6వ తరగతి విద్యార్థులకు భాషకు సంబంధించిన ప్రశ్నలు 20, గణితం ప్రశ్నలు 20 వస్తాయి. ఓఎంఆర్ షీట్లో జవాబులు గుర్తించాల్సి ఉంటుంది. 3వ తరగతి వారికి 60 నిమిషాలు, ఆరో తరగతి వారికి 75 నిమిషాల సమయం ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు భాషకు సంబంధించిన ప్రశ్నలు 30, గణితం ప్రశ్నలు 30 ఉంటాయి. వీరికి 90 నిమిషాలపాటు సమయం ఉంటుంది. ఈ పరీక్షల ఆధారంగానే జిల్లాలకు, రాష్ట్రానికి కూడా న్యాక్ మాదిరిగా ర్యాంకు ఇస్తారు. దీంతో ఉపాధ్యాయులు పకడ్బందీగా విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించి సంసిద్ధుల్ని చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్షను హనుమకొండ జిల్లాలోని 345 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు సంబంధించి 13,345 మంది విద్యార్థులకు నిర్వహించనున్నారు.

నేడు అసోసియేట్ కో–ఆర్డినేటర్లకు శిక్షణ

ఎస్‌ఈఏఎస్ సర్వేకు సంబంధించి జిల్లా, మండలస్థాయి అసోసియేట్ కో–ఆర్డినేటర్లకు శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో శిక్షణ నిర్వహిస్తారు. ఎంపిక చేసిన డైట్ కళాశాల నుంచి ఇద్దరు అధ్యాపకులు, డీఈఓ కార్యాలయం నుంచి ఇద్దరు కోఆర్డినేటర్లు, మండలస్థాయి కోఆర్డినేటర్లుగా ఉన్న హెచ్‌ఎంలు, ఎంఈఓలకు శిక్షణ ఇస్తారు. ఈనెల 30,3 1 తేదీల్లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఉంటుంది. ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాల, ఎంపికచేసిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొత్తం 607 మంది శిక్షణ ఇస్తారు.


ఆర్టీసీ స్నాక్స్ వ్యాపారం

ఏసీ బస్సుల్లో వాల్యూయాడెడ్‌తో అదనపు ఆదాయం

- ప్రయాణికులకు బలవంతంగా చిప్స్ ప్యాకెట్‌ను అంటగడుతున్న వైనం
- సూపర్ లగ్జరీ బస్సుల్లో ఇప్పటికే వాటర్ బాటిల్ పంపిణీతో భారం
- పెరిగిన ఏసీ బస్సు చార్జీలు.. చిరాకు పడుతున్న ప్రయాణికులు









ఆర్టీసీ ఏసీ బస్సులో అంటించిన పోస్టర్

ఏసీ బస్సులో ట్రూ గుడ్ స్నాక్స్ ప్యాకెట్ల బాక్స్

ఆర్టీసీ ఏసీ బస్సులో విక్రయిస్తున్న స్నాక్స్ ప్యాకెట్

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ అమలు చేస్తున్న కొన్ని విధానాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. విలువ జోడింపు (వాల్యూయాడెడ్) సేవల పేరుతో స్నాక్స్ (చిప్స్) వ్యాపారానికి పూనుకుంది. ప్రయాణికుల ఇష్టాలను పక్కన పెట్టి అవసరం లేకున్నా.. ట్రూ గుడ్ స్నాక్స్ ప్యాకెట్లు బలవంతంగా అంటగడుతోంది. టికెట్ చార్జీలో స్నాక్స్ ధరను కలిపి విక్రయిస్తూ కనిపించకుండా భారం మోపుతోంది. స్నాక్స్ అమ్మకాలతో ఏసీ బస్సులో ఒక్కో ప్రయాణికుడిపై రూ.30 అదనపు భారం పడుతోంది.

పోస్టర్లు అంటించి మరీ ప్రచారం

టీఎస్ ఆర్టీసీ ప్రత్యేకంగా వీటిని సొంత లేబుల్ ట్రూ గుడ్ పేరుతో తయారు చేయిస్తోంది. ఏసీ బస్సుల్లో పోస్టర్లు అంటించి మరీ ప్రచారం చేస్తున్నారు. టీఎస్ ఆర్టీసీ, హ్యాపీ జర్నీ, మిల్లెట్ స్నాక్ ప్యాకెట్ పేరుతో ఈ ప్యాకెట్‌పై నాట్ ఫర్ సేల్ అని రాసి విక్రయిస్తున్నారు. ఈ చిప్స్ విక్రయాలపై బస్ స్టేషన్‌లోని స్టాల్‌లను లీజ్‌కు తీసుకున్న వ్యాపారులు సైతం మండిపడుతున్నారు. తాము రూ.లక్షల్లో డిపాజిట్ చెల్లించి, రూ.వేలల్లో అద్దె చెల్లిస్తూ ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూరుస్తుంటే.. యాజమాన్యం చిప్స్, వాటర్ బాటిళ్లు విక్రయిస్తోందని, తమ వ్యాపారానికి గండికొడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరో రకం దోపిడీనే..

ఇప్పటికే ఆర్టీసీ ఖాళీ స్థలాలు లీజుకు ఇవ్వడం, సరుకు, పార్శిల్ రవాణా చేస్తూ అదనపు ఆదాయాన్ని రాబట్టుకుంటోంది. ఈక్రమంలో కొత్తగా ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామనే చెబుతూ మరో రకంగా దోపిడీ చేస్తుందనే అపవాదును మూటగట్టుకుంటోంది. టికెట్ చార్జీల్లో కలపడంతో ఇష్టం లేకున్నా.. భారాన్ని భరించాల్సి వస్తోందని ప్రయాణికులు తెలిపారు. అవసరమున్న వారు కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని ఏసీ బస్సు చార్జీ రూ.370 ఉండగా.. అదనంగా రూ.30 కలిపి రూ.400లకు పెంచి చిప్స్ ప్యాకెట్ అందిస్తున్నారు. గరుడ బస్సుకు చార్జీ రూ.430 ఉండగా రూ.460కి పెంచి చిప్స్ ప్యాకెట్ అందిస్తున్నారు. అదే విధంగా సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.280 ఉండగా రూ.290కి పెంచి వాటర్ బాటిల్ అందిస్తున్నారు. ఇప్పటికే ఏసీ బస్సుల్లో వాటర్ బాటిల్ అందిస్తున్నారు. చార్జీలు పెంచి చిప్స్ అందించడంపై ప్రయాణికుల నుంచి సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చిప్స్ విక్రయాలపై ఆర్టీసీ యాజమాన్యం పునరాలోచించాలని పలువురు కోరుతున్నారు.

రెండో రోజూ విధుల బహిష్కరణ

- పరీక్షల నియంత్రణాధికారితో చర్చలు



మల్లారెడ్డితో చర్చలు జరుపుతున్న ఉద్యోగ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కేయూ ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ల శుక్రవారం కూడా ఉద్యోగులు విధులు బహిష్కరించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉమెన్స్ పీజీ కళాశాల, యూనివర్సిటీ లా కళాశాలలకు కేయూ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు లకావత్ యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్, జనరల్ సెక్రటరీ కొర్నెలు ఆయా సంఘాల బాధ్యులు వచ్చి ఉద్యోగులు విధులను బహిష్కరింపజేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ ఉందని విధులు బహిష్కరించడం సరికాదన్నారు. ఈసందర్భంగా కొద్ది సేపు ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కేయూ ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ యూనియన్ బాధ్యులతో విడివిడిగా చర్చలు జరిపారు. మళ్లీ చర్చలకు రావాలని అందుకు వీసీ దృష్టికి తీసుకెళ్లానని బన్న అయిలయ్య వారికి సూచించారు. కేయూలోనూ ఉద్యోగులను విధుల నుంచి బహిష్కరింపజేశారు. ఈసందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, ఆడిట్ ఆఫీసర్ కిష్టయ్యతో చర్చించారు. కేయూ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి మాట్లాడుతూ గత నెల 24న చర్చలకు పిలిచి కొన్ని డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇచ్చి మాట తప్పిన రిజిస్ట్రార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు మహ్మద్ యూనస్, సతీశ్‌బాబు, తోట ప్రభాకర్, నిరంజన్, అంకూస్, రామనాథం, వేణు, మల్లికాంబ, డాక్టర్ విష్ణువర్ధన్, సుధాకర్, సుదయ్య రీంచందర్, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిరసనలు, సమ్మెలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఉద్యోగులు విధులు బహిష్కరించారు.

నిరంతరం అకడమిక్ యాక్టివిటీ జరగాలి

- కేయూ వీసీ తాటికొండ రమేశ్



మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: మానవ అంతర్గత పోరాటాల ఫలితమే టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ అని, విద్యార్థులకు నిరంతర అకాడమిక్ యాక్టివిటీ జరగాలని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. కేయూలోని కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా శుక్రవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించారు. మూడ్రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ వీసీ మాట్లాడుతూ.. మంచి అకాడమిక్ వాతావరణం కాకతీయ యూనివర్సిటీలో కొనసాగుతోందన్నారు. మరిన్ని కొలబరేట్ కార్యక్రమాల్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ రాధిక, ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, అధ్యాపకులు ఆసీం ఇక్బాల్, డాక్టర్ మేఘనారావు, అడ్జెంట్ ఆచార్యులు కృష్ణమాచార్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం



ఎంజీఎం మార్చురీలో తిరుపతిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్డీఓ సంపత్‌రావు

నెక్కొండ/సంగెం : ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన రైతు చింతిరెడ్డి తిరుపతిరెడ్డి (49) ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం కెనాల్ సమీపంలోని ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ప్లాంటేషన్ వద్దకు వెళ్లాడు. కెనాల్ నుంచి విద్యుత్ మోటర్ ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కెనాల్‌లో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య మహేశ్వరితోపాటు బంధువు చొల్లేటి యుగేందర్ వెళ్లి కెనాల్ వద్ద చూడగా తిరుపతిరెడ్డి బైక్, చెప్పులు కనిపించాయి. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం నెక్కొండ మండలంలోని రెడ్లవాడ -గొట్లకొండకు వెళ్లే మార్గంలోని ఎస్సారెస్పీ కెనాల్ చెట్ల పొదల్లో మృతదేహం చిక్కుకుంది. రైతు మాలోత్ శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. సంగెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు నెక్కొండ, సంగెం ఎస్సైలు జానీపాషా, ఎం.భరత్ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్య మహేశ్వరి, కుమారుడు రమణారెడ్డి, కుమార్తె స్వాతి ఉన్నారు.

నివాళి అర్పించిన డీఆర్డీఓ

ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుపతిరెడ్డి మృతదేహాన్ని వరంగల్ డీఆర్డీఓ ఎం.సంపత్‌రావు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఎంజీఎం మార్చురీలో సందర్శించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పలువురు ఈజీఎస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సంతానం కలగట్లేదని ఆత్మహత్య



తిలోత్తమ మృతదేహం

ఎల్కతుర్తి: వివాహమై నాలుగేళ్లు గడుస్తున్నా.. సంతానం కలగడం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఒడిశా రాష్ట్రం బలేశ్వర్ జిల్లా సునారి గ్రామానికి చెందిన తిలోత్తమ బెహర్(22)–అనంట బెహర్ దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి వచ్చారు. మండల కేంద్రం శివారులోని గోపాల్‌పూర్ రోడ్డు పక్కన గ్రానైట్ ఫ్యాక్టరీల ప్రాంతంలో కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తిలోత్తమ బెహర్‌కు వివాహమై నాలుగేళ్లు గడుస్తున్నా.. పిల్లలు కలుగకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న బగునూట బెహర్ ఫిర్యాదు మేరకు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల హక్కుల కోసం కృషి

మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబూరావు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గీసుకొండ : దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం మాలమహానాడు కృషి చేస్తోందని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబూరావు అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో మాలమహానాడు 18వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం జరిగింది. జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లం రాంకుమార్ ఆధ్వర్యంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మన్నె బాబూరావు మాట్లాడుతూ.. దళితులపై జరుగుతున్న దాడులపై చేస్తున్న పోరాటంతో మాలమహానాడు జాతీయ సంఘంగా గుర్తింపు సాధించిందన్నారు. మాలమహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అంకేశ్వరం రాంచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బండ్ల సాంబయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మేదరి భవాని, సంఘం నాయకులు వల్లెం సుధాకర్, కొరివి అనిల్, మగ్గిడి యాదగిరి, సాయి, వెంకటేశ్వర్‌రావు, అనిల్, సాయికుమార్, ఉదయ్, అఖిల్ పాల్గొన్నారు.

అమీనాపురంలో ఎస్సారెస్పీ కాల్వకు గండి

- రాత్రి సమయంలో గండికొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- కేసముద్రం స్టేషన్‌లో జలమయంగా మారిన కాలనీలు



ఎస్సారెస్పీ కాలువకు గండికొట్టిన చోట వృథాగా పోతున్న నీళ్లు

కేసముద్రం: గుర్తు తెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండికొట్టడంతో సాగునీరు వృథాగాపోయిన ఘటన మండలంలోని అమీనాపురం గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్సారెస్పీ డీబీఎం–48 కాల్వ నుంచి వెళ్లే ఉపకాల్వ(14ఎల్)కు అమీనాపురం సమీపంలో ఏర్పాటు చేసిన పాయింట్ వద్ద గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండికొట్టారు. దీంతో ఇప్పటికే నిండుకుండలా ఉన్న అమీనాపురం గ్రామ చెరువులోకి నీరు చేరడంతో మత్తడిపడింది. ప్రవాహంతో శుక్రవారం తెల్లవారుజామున కేసముద్రం స్టేషన్‌లోని అంబేడ్కర్ సెంటర్, సంతోశ్ నగర్‌కాలనీ జలమయమయ్యాయి. దీంతో కాలనీ ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు కాల్వకు జేసీబీని ఉపయోగించి గండి కొట్టినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా.. ఎస్సారెస్పీ డీఈ కుమారస్వామి, ఏఈ రూప్‌కుమార్ చేరుకుని, వెంటనే డీబీఎం–48కాల్వ వద్ద గేటును మూయించి జలాలను నిలిప. గండిపడిన చోట మట్టితో మరమ్మతులు చేపట్టినట్లు డీఈ తెలిపారు. అనంతరం ఈ ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సారెస్పీ అధికారులు ఫిర్యాదు చేశారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

- ఆర్టీసీ డ్రైవర్ మృతి..
- 8 మంది ప్రయాణికులు, ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- వరంగల్, హైదరాబాద్‌కు తరలింపు
- సహాయక చర్యల్లో పోలీసులు



ఘటనాస్థలిలో ట్యాంకర్, ఆర్టీసీ బస్సు



మృతుడు బస్సు డ్రైవర్ యాదగిరి, ఫైల్ ఫొటో



గాయపడిన జి.నవీన్



స్వరూప, కూతురు కీర్తన



ట్రాక్టర్ డ్రైవర్ బాలయ్య



భార్యాభర్తలు మంజుల, అశోక్

జనగామ: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు (రాజధాని) ఢీ కొట్టిన ఘటనలో బస్సు డ్రైవర్ మృతి చెందగా.. ఎనిమిది మంది ప్రయాణికులతో పాటు ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. జనగామ మండలం యశ్వంతాపూర్ సమీపం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ శివారు సీజేఐటీ సమీప జాతీయ రహదారి డివైడర్లపై నాటిన గ్రీనరీకి నీరు అందిస్తున్న వాటర్(ట్రాక్టర్) ట్యాంకర్‌ను వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు(రాజధాని) వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. సీట్లలో కూర్చున్న వారు ఎగిరిపడ్డారు. బస్సు డ్రైవర్, ఎనిమిది మంది ప్రయాణికులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ తల, చేతులు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పలువురు స్థానికులు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సై సృజన్, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వరంగల్–1 డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బి.యాదగిరి(54)ది వరంగల్ లేబర్ కాలనీ. ప్రమాదంలో గాయపడిన ఆయన జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని జనగామ, వరంగల్–1 డిపో మేనేజర్లు జ్యోత్స్న, వెంకటేశం పరిశీలించారు.

బస్సులో 40 మంది ప్రయాణికులు..

ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన సోమ స్వరూప, ఆమె కూతురు కీర్తన, నర్సంపేటకు చెందిన పులి అలేఖ్య వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. వీరిలో స్వరూప, అలేఖ్యకు తీవ్ర గాయాలు కాగా.. వరంగల్‌కు రెఫర్ చేశారు. అలాగే హైదరాబాద్ మెహిదీపట్నానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి గుడ్ల నవీన్, కిషన్‌గంజ్‌కు చెందిన మేడ రాము ఉద్యోగరీత్యా వరంగల్‌కు వచ్చారు. జగిత్యాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జల్ల గణేశ్ బెంగళూరుకు, వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగంపేటకు చెందిన జె.అశోక్, భార్య మంజుల దసరా పండుగకు వచ్చి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. గాయపడిన వీరికి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వరంగల్, హైదరాబాద్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. మిగతా ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఏదు బాలయ్యకు వైద్యం అందిస్తున్నారు.

ఝాన్సీరెడ్డి పౌరసత్వానికి బ్రేకులు



దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయిన హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీరెడ్డి పౌరసత్వానికి బ్రేకులు పడ్డాయి. ఆరు నెలల కింద టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు పాలకుర్తి నియోజకవర్గంలో అడుగిడిగిన ఝాన్సీరెడ్డికి అతి తక్కువ సమయంలోనే క్షేత్రస్థాయిలో క్రేజ్ పెరిగింది. అపార రాజకీయ అనుభవజ్ఞులు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీద గెలవడం ఆషామాషీ కాదనీ పలువురు రాజకీయ విశ్లేషకుల అంచనా.. ఆచరణాత్మకంగా కార్యరూపం దాల్చింది. అమెరికాలో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు భారతదేశ పౌరసత్వం పొందాలంటే.. కనీసం ఏడాది నిర్దేశిత సమయం ఇక్కడ నివాసం ఉండాలి. 2009 సిటిజన్‌షిప్ యాక్ట్ మార్గదర్శకాల మేరకు ఇప్పుడే ఝాన్సీలక్ష్మీరెడ్డికి పౌరసత్వం ఇవ్వలేమని హైదరాబాద్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమరానికి సిద్ధమైన ఆమె.. పౌరసత్వం నిరాకరణతో సవాల్‌గా తీసుకొని కోడలు మామిడాల యశస్వినిరెడ్డికి ఏఐసీసీచే టికెట్ ఖరారు చేయించి యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దింపడం గమనార్హం.

20 కేజీల గంజాయి పట్టివేత



నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్

ఖిలా వరంగల్: అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 20 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం చింతల్ రోడ్డు పుప్పాలగుట్టలోని మండల ఎక్సైజ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. డిప్యూటీ కమిషన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అంజన్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్, శివనగర్ పరిసరాల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్‌కే.లతీఫ్, జి.వెంకట్రామ్‌రెడ్డి, టి.శ్రీనివాస్, ఎం.మాధవీలత ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 20 కేజీల ఎండు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఎండీ అజీజ్ ఖాన్, బోనాల అనూషను అరెస్ట్ చేసి వారి నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈతనిఖీల్లో ఎక్సైజ్ శాఖ ఎస్సైలు రజిత, ఏ.సరిత, రేష్మ సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

5 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: కాజీపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకులను ఆపి తనిఖీ చేయగా.. 5 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ తెలిపారు. కాజీపేట పట్టణ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిందితులు పరారీలో ఉండగా.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే 87126 59020 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది వీరమల్లు, వెంకటనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు, గుడాలు, దావత్ యాడబాయె కేసీఆర్

- హామీలు నెరవేర్చకుండానే మళ్లీ ఓరుగల్లులో ప్రచారమా?
- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్



మాట్లాడుతున్న బీసీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్

వరంగల్: 'వరంగల్‌లో పదేళ్ల క్రితం ముంపు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నావ్. పేదలకు సొంత ఇళ్లను కట్టించి సొంత ఇంట్లో వారితో యాట పోతులను కోసి కల్లు, గుడాలతో దావత్ చేసుకుందామని హామీ ఇచ్చావ్. ఆమాటలు ఏమయ్యాయి సీఎం కేసీఆర్' అని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక బీసీ నాయకులతో కలిసి వరంగల్ ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చక పోవడమే కాకుండా వరంగల్ తూర్పు ఎమ్మెల్యేతో పేదలు తలదాచుకోవడానికి జక్కలొద్దిలో వేసుకున్న గుడిసెలను అధికారం అడ్డం పెట్టుకుని పోలీసుల చేత తొలగించడం, అరెస్టులు చేయించడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. తూర్పులో కబ్జాలే తప్ప ఎమ్మెల్యే నరేందర్ హయాంలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. వరంగల్‌లో బీసీ నాయకత్వాన్ని అణగదొక్కుతున్న ఎమ్మెల్యే నరేందర్ స్థానికతపై, సామాజిక నేపథ్యంపై అనేక అనుమానాలున్నాయని ఆయన ఆరోపించారు. పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు. అట్టడుగు వర్గాల సంపూర్ణ అభ్యున్నతే ప్రాతిపదికగా రాజకీయంగా ముందుకు సాగుతామని దాసు సురేశ్ అన్నారు. సమావేశంలో బీసీ ఐక్య చైతన్య సమితి అధ్యక్షుడు ఆకారపు మోహన్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు దామర కొండ కొమరయ్య, బీసీ నాయకులు సాంబరాజు ప్రభాకర్, పనికెల శ్రీనివాస్, సంజయ్‌చారి, సయ్యద్ యాకుబ్, కమర్, హుస్సేన్ పాల్గొన్నారు.

నిట్‌కు 5జీ ల్యాబ్

- ప్రకటించిన పీఎం నరేంద్రమోదీ



ప్రధాన ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌కు 5జీ యూజ్ కేస్ ల్యాబ్‌ను ప్రదానం చేయనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకటించారు. దేశవ్యాప్తంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీఓటీ), కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో వంద 5–జీ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా నిట్ వరంగల్‌లో ఒకటి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్‌ను నిట్ యాజమాన్యం, విద్యార్థులు వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.